## అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి



**సత్తుపల్లి:** ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ సూచించారు. ఖమ్మం జిల్లా కల్లూరు మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ పాల్గొని పట్టణ అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రహదారుల మరమ్మతులు, ప్రజా సమస్యల పరిష్కారంపై సభ్యులతో సమీక్ష నిర్వహించారు. మున్సిపల్ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కౌన్సిలర్లు తమ అభిప్రాయాలు, సమస్యలను సమావేశంలో ప్రస్తావించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపర్చడంతో పాటు తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## సోషలిజం సాధించడమే సుందరయ్యకు ఘన నివాళి

### సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్



**ఆదిలాబాద్:** కార్మికులు, పేదలను దోపిడీకి గురిచేస్తున్న పెట్టుబడిదారీ వ్యవస్థను కూల్చి సమసమాజం, సోషలిజం స్థాపించడమే సుందరయ్యకు నిజమైన ఘన నివాళి అని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు. సీపీఎం పార్టీ నిర్మాణ శిల్పి పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సుందరయ్య భవన్లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సంపద కొద్ది మంది చేతుల్లోనే కేంద్రీకృతమవుతుండగా, 90 శాతం మంది ప్రజలు పేదరికంలో జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగాన్ని పెంచి పోషించేది పెట్టుబడిదారీ వ్యవస్థేనని అన్నారు. కుల, మతాల పేరుతో సమాజాన్ని విభజించి ప్రజల్లో విద్వేషాలు రెచ్చగొడుతోందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ఆదా చేయాలని, బంగారం కొనుగోలు చేయవద్దని ప్రధాని ప్రచారం చేయడం వెనుక ఆర్థిక సంక్షోభం దాగి ఉందన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థ ఆర్థిక, సామాజిక, రాజకీయ అసమానతలను పెంచి పోషిస్తోందని ఆరోపించారు. ఈ వ్యవస్థ మార్పు కోసం యువత, కార్మిక వర్గం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అన్నమొల్ల కిరణ్, సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.మంజుల, ఉయికే విష్ణు, ఎం.గంగన్న, నాయకులు ఆరిఫా బేగం, రాధ, పొచ్చన్న, మంజూష తదితరులు పాల్గొన్నారు.

## గోదాముల వద్ద రైతుల ఆందోళన



**, సత్తుపల్లి:** వేంసూర్ మండల పరిధిలోని కల్లూరు గూడెం ఏఎంసీ గోదాముల వద్ద రైతులు మంగళవారం ఆందోళనకు దిగారు. మొక్కజొన్న దిగుమతుల కోసం రోజుల తరబడి గోదాముల వద్ద వేచి ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. హమాలీల కొరత కారణంగా పంట దిగుమతులు నిలిచిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ట్రాక్టర్లు, ఇతర వాహనాలతో గోదాముల వద్దే ఉండిపోవాల్సి వస్తోందని తెలిపారు. దీంతో రైతులకు అదనపు ఖర్చులు, ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధికారుల నిర్లక్ష్యంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని హమాలీల సమస్యను పరిష్కరించి, పంట దిగుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు.

# అక్షర ప్రేమికుల అపురూప కలయిక

- తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో సీనియర్ పాత్రికేయుల ఆత్మీయ సత్కారం
- ప్రజా చైతన్యమే శ్వాసగా సాగిన ప్రస్థానం





**హైదరాబాద్ :**

తెలుగు పత్రికా రంగానికి దిశానిర్దేశం చేసిన అక్షర ప్రేమికులు, యాభై వసంతాల పాత్రికేయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న ఉద్దండుల అపూర్వ సంగమానికి తెలంగాణ మీడియా అకాడమీ వేదికైంది. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా, కేవలం అక్షరాన్నే ఆయుధంగా చేసుకుని ప్రజా చైతన్యాన్ని రగిలించిన మేరునగధీరులను అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి ఘనంగా సత్కరించి, ఆత్మీయతను పంచుకున్నారు. ఈ చిరస్మరణీయ సమావేశంలో రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ జి. ముకుందరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, సీనియర్ పాత్రికేయులతో ఎంతో గౌరవంగా ముచ్చటించారు.

### అక్షర యోధుల అనుభవాల ఆవిష్కరణ

దశాబ్దాలుగా తెలుగు నేలను జర్నలిజానికి అడ్డాగా మార్చి, తమ కార్ఖానాలో ఎంతోమంది కలాలు, గళాలను తయారు చేసిన దిగ్గజాలు ఈ వేదికపై తమ అనుభవాలను నెమరువేసుకున్నారు. ఆలోచనల్లో, అక్షర సంధానంలో ఇప్పటికీ నవ యువకుల్లా దూసుకుపోయే ఈ సీనియర్ జర్నలిస్టులు, మారుతున్న కాలంలో జర్నలిజాన్ని ఎలా బతికించుకోవాలో, విలువలను ఎలా కాపాడుకోవాలో భావి తరాలకు మార్గనిర్దేశనం చేశారు. సాహిత్య సంపాదకీయాలలో ఈ పాత్రికేయుల ప్రతీ రచనా ఒక కావ్యమై నడిచిందని, సముద్రమంతటి గాంభీర్యంతో, భావనా వైశాల్యంతో సాగిన వీరి అద్భుత సాహిత్యదర్శనం ఎందరికో స్ఫూర్తిదాయకమని వక్తలు కొనియాడారు.

### ఒకే వేదికపై పత్రికా రంగ మేరునగధీరులు

సాహితీవేత్తలుగా, తత్వచింతకులుగా, ఉద్యమశీలురుగా ఎవరికి వారే సాటి అయిన తెలుగు, ఆంగ్ల, ఉర్దూ పత్రికా రంగ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సదస్సులో సీనియర్ పాత్రికేయులు ఐ. వెంకట్రావ్, కె. రామచంద్ర మూర్తి, కేశవరావు దాస్, ఎస్. నగేష్ కుమార్, దేవులపల్లి అమర్, భండారు శ్రీనివాసరావు, రవీందర్ ఎం.పి., పి.ఏ. రామారావు, ఆర్. దిలీప్ రెడ్డి, ఆర్.వి. రామారావు, మాడభూషి శ్రీధర్, ఎం. సుబ్బారావు, జగన్, ఎస్. వినయ్ కుమార్, వై. నరేందర్ రెడ్డి, విరాహత్ అలీ , రామ్ నారాయణ లతో పాటు టైమ్ ఆఫ్ ఇండియా ఎడిటర్ (ఇన్వెస్టిగేషన్) ఉడుముల సుధాకర్ రెడ్డి, సియాసత్ ఎడిటర్ ఆమెర్ అలీ ఖాన్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

### విలువలతో కూడిన జర్నలిజానికి దిక్సూచి

విశ్వ విజ్ఞానాన్ని పిడికిట్లో ఇముడ్చుకుని, కాలాన్ని, కలాన్ని నమ్ముకున్న ఈ కాలమిస్టులు ఎన్ని అడ్డంకులు ఎదురైనా అంకితభావంతో ఎంచుకున్న బాటను వదలని దిశానిర్దేశకులని సభ కొనియాడింది. ఎందులోనూ రాజీలేని వ్యక్తిత్వం, పనిమంతుడైతే చాలు ప్రేమించే నిష్కల్మష మనస్తత్వం వీరి సొంతమని పేర్కొన్నారు. సీనియర్ల సమక్షంలో సాగిన ఈ ఆత్మీయ సదస్సు తెలుగు పత్రికా రంగ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుంది.



# ఆవులు, దూడలను కుర్బానీ ఇవ్వొద్దు

**బక్రీద్ సందర్భంగా ప్రశాంత వాతావరణం కాపాడాలి**

**ముస్లింలకు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ విజ్ఞప్తి**

**చురకలు విలేఖరి కరీంనగర్, మే, 19**

బక్రీద్ పండుగ సందర్భంగా ఎట్టి పరిస్థితుల్లోనూ ఆవులు, ఆవు దూడలను కుర్బానీ ఇవ్వవద్దని కరీంనగర్ ఉమ్మడి జిల్లాల మస్జిద్, ఈద్గా, ఖబ్రస్తాన్ మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్షుల అసోసియేషన్ అధ్యక్షుడు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ ముస్లిం సోదరులకు విజ్ఞప్తి చేశారు. ఎవరైనా ఆవులను సరఫరా చేసినా, కుర్బానీకి ఉపయోగించినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో హిందూ, ముస్లిం సోదరులు అన్నదమ్ముల్లా కలిసి అన్ని పండుగలను గంగా జమున తహజీబ్ సంప్రదాయంతో జరుపుకుంటారని తెలిపారు. ప్రతి పండుగ సందర్భంలో పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ సామరస్య వాతావరణాన్ని కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. బక్రీద్ సందర్భంగా ముస్లింలు మేకపోతు, గొర్రెపోతు, దున్నపోతు వంటి జంతువులను మాత్రమే కుర్బానీ ఇవ్వాలని సూచించారు. పండుగలను ప్రశాంతంగా నిర్వహించడంలో పోలీసు శాఖకు అన్ని వర్గాల ప్రజలు సహకరిస్తున్నారని తెలిపారు.

పండుగల సమయంలో బంధుమిత్రులు ఇళ్లకు



వచ్చిపోతూ ఆనందంగా గడుపుతారని, పరస్పర ఆతిథ్యంతో సోదరభావాన్ని పెంపొందించుకోవడం ఉమ్మడి జిల్లాల ప్రత్యేకత అని మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ పేర్కొన్నారు.

# సోషల్ మీడియా ప్రకటనతో యువకుడికి టోకరా

- చెవుడు నయం చేస్తామంటూ రూ.76వేల సైబర్ మోసం

**సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా వీఎం బంజర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోషల్ మీడియా ప్రకటనను నమ్మిన ఓ యువకుడు సైబర్ కేటుగాళ్ల చేతిలో మోసపోయిన ఘటన వెలుగులోకి వచ్చింది. చెవుడు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని నమ్మబలికి బాధితుడి నుంచి రూ.76వేల వరకు కాజేసినట్లు పోలీసులు తెలిపారు. పెనుబల్లి మండలం ముత్తగూడెం గ్రామానికి చెందిన యువకుడు సోషల్ మీడియాలో కనిపించిన ఓ ఆరోగ్య ప్రకటనను నమ్మాడు. ప్రత్యేక టాబ్లెట్లు వాడితే వినికిడి సమస్య పూర్తిగా నయం అవుతుందని ప్రచారం చేసిన గుర్తుతెలియని వ్యక్తులు బాధితుడిని ఫోన్ ద్వారా సంప్రదించారు. ముందుగా రిజిస్ట్రేషన్ ఫీజు పేరుతో కొంత మొత్తం ఆన్లైన్లో చెల్లింపజేసి, అనంతరం ప్రత్యేక మెడిసిన్ పంపిస్తామని, పూర్తి కోర్సు కోసం మరిన్ని చార్జీలు అవసరమని చెబుతూ విడతల వారీగా డబ్బులు వసూలు చేశారు. ఈ విధంగా వివిధ కారణాలు చూపుతూ మొత్తం రూ.76వేల వరకు తీసుకున్నప్పటికీ మందులు పంపించకపోవడంతో బాధిత యువకుడికి అనుమానం వచ్చింది. పలుమార్లు ఫోన్ చేసినా స్పందన లేకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించి వీఎం బంజర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు సైబర్ క్రైమ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. సోషల్ మీడియాలో వచ్చే ఆరోగ్య సంబంధిత ప్రకటనలను నమ్మవద్దని, మందులు, చికిత్సల పేరుతో డబ్బులు అడిగే వారిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్యుల సలహా లేకుండా ఆన్లైన్ ప్రకటనల ఆధారంగా మందులు కొనుగోలు చేయడం ప్రమాదకరమని తెలిపారు. అనుమానాస్పద కాల్స్, మెసేజ్లు, ఆన్లైన్ మోసాలపై వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్లైన్ 1930కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# జిల్లా పర్యాటక వైభవాన్ని ప్రపంచానికి చాటుదాం

- 'ఇన్ఫ్లుయెన్సర్ రీల్స్ కాంపిటీషన్'కు కలెక్టర్ రాజర్షిషా పిలుపు

: ఆదిలాబాద్ పర్యాటక వైభవాన్ని ప్రపంచానికి చాటుదామని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక పర్యాటక వారోత్సవాల సందర్భంగా వినూత్నంగా 'ఇన్ఫ్లుయెన్సర్ రీల్స్ కాంపిటీషన్'నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం మావల పార్క్లో నిర్వహించిన ప్రెస్ టూర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో కలిసి సఫారీలో పాల్గొని పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాలోని అద్భుతమైన ప్రకృతి సంపద, జలపాతాలు, చారిత్రక వైభవం, ఆదివాసీ సంస్కృతిని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పర్యాటకులకు పరిచయం చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ పోటీల ద్వారా జిల్లా పర్యాటక ప్రాంతాలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడమే కాకుండా స్థానిక కంటెంట్



క్రియేటర్ల ప్రతిభ వెలుగులోకి వస్తుందని పేర్కొన్నారు. సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు, కంటెంట్ క్రియేటర్లు, మీడియా ప్రతినిధులు, సోషల్ మీడియా హ్యాండ్లర్స్ ఈ పోటీల్లో పాల్గొనవచ్చని చెప్పారు. పోటీదారులు ఆదిలాబాద్ జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు, ప్రకృతి అందాలు, జలపాతాలు, చారిత్రక కట్టడాలు, స్థానిక సంస్కృతిని ప్రతిబింభించేలా రీల్స్, వీడియోలను రూపొందించాల్సి ఉంటుందని సూచించారు. పోటీకి పంపే వీడియోలు తప్పనిసరిగా అత్యుత్తమ నాణ్యతతో కూడిన 4కే ఫార్మాట్లో ఉండాలని తెలిపారు. ఆసక్తి గల క్రియేటర్లు ఈనెల 21వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలలోపు తమ సొంత పెన్డ్రైవ్ ద్వారా జిల్లా కేంద్రంలోని విద్యుత్ తరంగిణి ఫంక్షన్ హాల్లో వీడియోలను నేరుగా అందజేయాలని అన్నారు. సందేహాలు, సలహాల కోసం జిల్లా పర్యాటక శాఖ అధికారి వి.రవికుమార్ (9440816087), జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి ఇ.విష్ణు వర్ధన్ (9154170902)లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. పోటీలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ప్రథమ బహుమతిగా రూ.5వేలు, ద్వితీయ బహుమతిగా రూ.4వేలు, తృతీయ బహుమతిగా రూ.3వేల నగదు బహుమతులు అందజేయనున్నట్లు వివరించారు. ఆదిలాబాద్ జిల్లా, పరిసర ప్రాంతాల సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు, కంటెంట్ క్రియేటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకుని జిల్లా పర్యాటక రంగ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.



# ఎస్పీఎంలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి

**కాగజ్నగర్:** సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు సంఘం ఎన్నికలు తక్షణమే నిర్వ హించాలని డిమాండ్ చేస్తూ జేఏసీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్పీఎం గేటు ముందు నిర్వహించిన సమావేశంలో రిజిస్ట్రేషన్ నం. ఈ–2381 కార్యనిర్వాహక అధ్యక్షులు గోలెం వెంకటేశం మాట్లాడుతూ 2018 తర్వాత ఇప్పటివరకు గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించకుండా జేకే యాజమాన్యం కాలయాపన చేస్తోందని ఆరోపించారు. బయటి రాష్ట్రాల కార్మికులకు అధిక వేతనాలతో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ, స్థానిక కార్మికులను నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. స్థానిక కార్మికులకు కనీసం రూ.20వేల వేతనం కూడా అందకపోవడం దారుణమన్నారు. ఎస్పీఎం పునఃప్రారంభం తర్వాత సుమారు 250 మంది శాశ్వత కార్మికులను విధుల్లోకి తీసుకోకుండా యాజమాన్యం అన్యాయం చేసిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఐఆర్ కోడ్ల పేరుతో, కోర్టు వ్యవహారాలను సాకుగా చూపుతూ యాజమాన్యం ఎన్నికలను వాయిదా వేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలోని ఇతర కంపెనీల్లో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వ హించినప్పటికీ, సిర్పూర్ పేపర్ మిల్లులో మాత్రం ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం, కార్మిక శాఖ ఈ అంశాన్ని పట్టించుకోవడం లేదని విమర్శించారు. తక్షణమే కార్మిక శాఖ, రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని, లేనియెడల రెండు రోజుల తర్వాత రిలే నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఈ నిర్ణయానికి కార్మికు లందరూ కట్టుబడి ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు సి.వెంకటేష్, 1028 సంఘం నాయకులు కలికోట రమణయ్య, 2735 సంఘం నాయకులు గోగర్ల రాములు, రాజేష్ యాదవ్, జాడి అశోక్, సీఐటీయూ నాయకులు ముంజ్యం శ్రీనివాస్, షెబ్బీర్ పాషా, 966 సంఘం నాయకులు గోగర్ల కన్నయ్య, కంబాల ఓదెలు, 2381 సంఘం నాయకులు అశ్విని కుమార్ సింగ్, జాను ప్రకాష్, నానయ్య, వల్లాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.




# సుందరయ్య ఆశయాలు నేటి తరానికి ఆదర్శం

**తాండూర్:** సుందరయ్య ఆశయాలు నేటి తరానికి ఆదర్శమని సీపీఎం తాండూర్ మండల కార్యదర్శి దాగాం రాజారాం అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం వ్యవస్థా పకులు, ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతిని మంగళవారం తాండూర్ మండలం నరసాపూర్ గ్రామంలో సీపీఎం తాండూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య అసలు పేరు సుందర్ రామ్ రెడ్డి అని, కుల గుర్తింపును తిరస్కరిస్తూ తన పేరును సుందరయ్యగా మార్చుకున్నారని తెలిపారు. కుల వివక్షకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేసిన ఆయన మహిళలపై వివక్షను కూడా ప్రశ్నించారని అన్నారు. సహపంక్తి భోజనాలకు దళితులను ఆహ్వానిస్తూ కుల కట్టుబాట్లకు వ్యతిరేకంగా పోరాడిన మహానేత సుందరయ్య అని కొనియాడారు. కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఎర్రజెండా విశిష్టతను కాపాడిన నాయకుడిగా ఆయన నిలిచారని పేర్కొన్నారు. సుందరయ్య అసెంబ్లీ, పార్లమెంట్ సమా వేశాలకు కూడా సైకిల్పై వెళ్లేవారని, ప్రజా సమస్యలతో కూడిన ఫైళ్ల సంచిని వెంట తీసుకెళ్లి చట్టసభల్లో ప్రజల గొంతుకగా నిలిచారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు వేల్పుల శంకర్, ఆత్రం బాజీరావు, కోట్నాక శ్యామ్రావు, కురుషింగా లింగారావు, సోయం ప్రభాకర్, సోయం గంగు, కురిసింగ సోనేరావు తదితరులు పాల్గొన్నారు.




# వరి లోడ్లతో ట్రాక్టర్లు రోజుల తరబడి నిరీక్షణ

## గిడ్డంగి వద్ద రైతుల అవస్థలు


**తాండూర్:** తాండూర్ మండలంలో వరి ధాన్యం పండించిన రైతులకు కష్టాలు తప్పడం లేదు. తాండూర్ ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని తాండూర్, కొత్తపల్లి, అచలాపూర్, రేచిని, బోయపల్లి తదితర గ్రామాల రైతులు తాము పండించిన వరి ధాన్యాన్ని తూకం చేసిన అనంతరం రేచిని గ్రామ శివారులో ఉన్న మండల స్థాయి గిడ్డంగి వద్ద ట్రాక్టర్లలో వరి లోడ్లతో రోజుల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. ఒకసారి బెల్లంపల్లి వెళ్లాలని, అక్కడికి వెళ్లిన తర్వాత మళ్లీ రేచిని వెళ్లాలని అధికారులు సూచిస్తున్నారని, దీంతో అటు ఇటు తిరుగుతూ సమయం, డబ్బు నష్టపోతున్నామని రైతులు ఆరోపిస్తున్నారు. అలాగే హమాలీలు ఇష్టానుసారం డబ్బులు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండల స్థాయి గిడ్డంగిలో 50వేల బస్తాల నిల్వ సామర్థ్యం ఉండగా, ఇప్పటికే దాదాపు 60వేల వరి ధాన్యం బస్తాలు నిల్వ చేసినట్లు గిడ్డంగి ఇంచార్జి తెలిపారు. మరోవైపు హమాలీల కొరత కారణంగా వరి ధాన్యం బస్తాల అన్లోడింగ్ ప్రక్రియ సక్రమంగా సాగడం లేదని ప్రాథమిక సహకార సంఘం అధికారులు పేర్కొన్నారు. గిడ్డంగి వద్ద రైతులకు కనీసం నీడ, తాగునీటి సౌకర్యాలు కూడా కల్పించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి రైతుల ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ విషయమై తాండూర్ తహశీల్దార్ యు.జ్యోత్స్నను వివరణ కోరగా, ప్రస్తుతం హమాలీల కొరత లేదని, రెవెన్యూ ఆర్ఐ గిడ్డంగి వద్ద ఉండి పరిస్థితిని పర్యవేక్షిస్తూ వరి ధాన్యం ట్రాక్టర్ల లోడ్లను హమాలీలచే అన్లోడ్ చేయిస్తున్నట్లు వివరించారు.



# ఆదివాసీల హక్కులను కాలరాస్తున్న కేంద్రం

- వైజాపూర్లో ఘనంగా లీడర్షిప్ డెవలప్మెంట్ మిషన్

**గుడిహత్నూర్:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆదివాసీల హక్కులను పూర్తిగా కాలరాస్తోందని ఆదివాసి కాంగ్రెస్ నేషనల్ కోఆర్డినేటర్ శ్రీమతి కుసుమ్ తాయి ఆలం విమర్శించారు. లీడర్షిప్ డెవలప్మెంట్ మిషన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని వైజాపూర్ గ్రామంలో ఆదివాసి గూడాల పర్యటన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్తో కలిసి కుసుమ్ ఆలం హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కుసుమ్ ఆలం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మాత్రమే ఆదివాసీల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పనిచే స్తోందని స్పష్టం చేశారు. ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఆదివాసీలు తమ మూలాలైన సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడు కుంటూనే ఆధునిక సాంకేతికతను అందిపు చ్చుకుని అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి, ఆదివాసి యువత ఉన్నత విద్యాభి వృద్ధికి ప్రత్యేక చర్యలు అవసరమన్నారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి ఆదివాసీల పక్షపాతిగా ఉంటూ వారి హక్కుల కోసం పోరాడుతోందని గుర్తుచేశారు. కార్యక్రమంలో భాగంగా ఆదివాసి సాంప్రదాయం ప్రకారం స్థానిక గ్రామస్తులతో కలిసి కుసుమ్ ఆలం, డాక్టర్ నరేష్ జాదవ్, బోరంచు శ్రీకాంత్ రెడ్డి తదితరులు సాంప్రదాయ నృత్యం చేసి వారిలో ఉత్సాహాన్ని నింపారు. నేతలకు గ్రామంలో గిరిజనులు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆదివాసీ కాంగ్రెస్ వైస్ చైర్మన్ సెడమాకి ఆనందరావు, మాజీ మార్కెట్ చైర్మన్ అల్లూరి సంజీవ్ రెడ్డి, ఇచ్చోడ మార్కెట్ చైర్మన్ కుంర సత్యవతి కోటేష్, వైజాపూర్ గ్రామ సర్పంచ్ సీతాబాయి–వెంకట్, జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.



# ధాన్యం తరలింపు, అన్లోడింగ్లో మరింత వేగం పెంచాలి

- కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

**సిరిసిల్ల:** కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలింపు, రైస్ మిల్లులు, గోదాముల్లో అన్లోడింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధి కారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియపై మంగళవారం ఉదయం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్తో కలిసి పౌర సరఫరాల, సహకార, గ్రామీణాభివృద్ధి, మెప్మా తదితర శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం వేయడం, తూకం వేసిన బస్తాలను నిర్దేశించిన రైస్ మిల్లులు, గోదాములకు సకాలంలో తరలించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం బస్తాల తరలింపునకు ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు సరిపడా వాహనాలను సమకూర్చాలని స్పష్టం చేశారు. అలాగే ధాన్యం లోడింగ్, అన్లోడింగ్ పనుల కోసం హమాలీల సంఖ్యను పెంచాలని తెలిపారు. ఎండ తీవ్రత దృష్ట్యా రైతులు, హమాలీలు ఇబ్బందులు పడకుండా కొనుగోలు కేంద్రాలు, మిల్లులు, గోదాముల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని అన్నారు. జిల్లాలో ఉన్న గోదాములను ధాన్యం అన్లోడింగ్కు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి సంబంధించిన ఆన్లైన్ ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియలో జాప్యం జరగకుండా చూడాలని డీఆర్డీఓ, డీసీఓ, ఏవో, మెప్మా తదితర అధికారులను ఆదేశించారు. మండల స్థాయి అధికారులు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను పర్యవేక్షిస్తూ ఎంట్రీ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను సంబంధిత శాఖల అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు తప్పనిసరిగా తనిఖీ చేస్తూ అవసరమైన సూచనలు ఇవ్వాలని పేర్కొన్నారు.



# జనగణనకు ప్రజాప్రతినిధుల సహకారం అవసరం



**హన్మకొండ:** జనగణనకు ప్రజాప్రతినిధుల సహకారం ఎంతో అవసరమని పరకాల రెవెన్యూ డివిజనల్ అధికారి నారాయణ అన్నారు. దామెర మండల తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, మండల స్థాయి రాజకీయ పార్టీల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జనగణన కార్యక్రమ నిర్వహణ, ఎస్ఐఆర్ (స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్) అమలు, పెండింగ్ ఓటర్ల మ్యాపింగ్ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగణన కార్యక్రమాన్ని సమర్థ వంతంగా నిర్వహించేందుకు ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల సహకారం అవస రమని, పెండింగ్లో ఉన్న ఓటర్లను వారి తల్లిదండ్రులతో మ్యాపింగ్ చేయడంలో గ్రామ స్థాయిలో చొరవ తీసుకోవాలని సూచించారు. దామెర తహశీల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవి మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించి, అధికారులు చేపడుతున్న కార్యక్రమాలకు సర్పంచులు, పార్టీ నాయకులు సహకరించాలని కోరారు. గ్రామ స్థాయిలో జనగణన, ఓటర్ల మ్యాపింగ్ కార్యక్రమాలను విజయవంతం చేయడానికి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో మండల స్థాయి రాజకీయ పార్టీల అధ్యక్షులు, గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలకు అంబలి పంపిణీ



**గంభీరావుపేట:** గంభీరావుపేట మండలం నర్మాల గ్రామంలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలకు గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో సల్ల, జావా అంబలి పంపిణీ చేశారు. మండుతున్న ఎండల కారణంగా కూలీలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కోకుండా ఉండేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ ప్రజల సంక్షేమం కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని గ్రామ సర్పంచ్ రాజబోయిన అర్చన ఆంజనేయులు, ఉప సర్పంచ్ గొర్రె సుదర్శన్, వార్డు సభ్యులు పాల్గొని కూలీలకు స్వయంగా సల్ల, జావా అంబలి అందజేశారు. వేసవి కాలంలో చల్లని పానీయాలు అందించడంతో కూలీలకు ఉపశమనం కలుగు తుందని పేర్కొన్నారు. కూలీలు గ్రామ పంచాయతీ పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలుపుతూ, ఇలాంటి కార్యక్రమాలు తమకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు కళ్యాణ్ కుమార్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సుందరయ్య వర్ధంతి వేడుకలు



**ఆదిలాబాద్:** సిపిఎం పార్టీ నిర్మాత, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి వేడుకలను ప్రజా సంఘాల కమిటీల ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి కుండిషేక్ గూడ ఉప సర్పంచ్ కుమ్ర భీంరావ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న మాట్లాడుతూ భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం సుందరయ్య చేసిన పోరాటాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకో వాలని, నాలుగు లేబర్ కోడ్స్ను రద్దు చేసి పాత కార్మిక చట్టాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. అడవి ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదివాసులకు జీవో నం.3 ప్రకారం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి, ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షుడు కొట్నాక్ సాకారం, సీఐటీయూ మండల కన్వీనర్ కొడప యశ్వంత్, నాయకులు మెస్రం కేశవ్, సిడం బాపూరావు, మనవి మానుకు, కిషన్, సుంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన మత్స్యకారుల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**

**ఆదిలాబాద్:** గిరిజన ప్రాంతాల్లోని మత్స్యకారుల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం మత్స్య శాఖ ఆధ్వర్యంలో ఉట్నూర్లోని కేబీ కాంప్లెక్స్ పీఎంఆర్సీ భవనంలో గిరిజన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్, ఉట్నూర్ ఐటిడిఏ పీఓ మంద మకరంద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన మత్స్యకారులు కేవలం సాంప్రదాయ పద్ధతులకే పరిమితం కాకుండా ఆధునిక చేపల పెంపక విధానాలను అలవర్చుకోవాలని సూచించారు. జిల్లాలోని గిరిజన జలాశయాలు, చెరువుల్లో మత్స్య సంపద పెంపుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తోందన్నారు. ప్రభుత్వం




అందిస్తున్న సబ్సిడీలు, రాయితీలను సద్వినియోగం చేసుకొని మత్స్యకారులు ఆర్థికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. గిరిజన మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపర్చేందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. చేపల ఉత్పత్తితో పాటు వాటి రవాణా, మార్కెటింగ్కు కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మత్స్యకారులకు సబ్సిడీపై వాహనాలు, ఐస్ బాక్సులు పంపిణీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. సంఘ సభ్యులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనంతరం ఐటిడిఏ మాట్లాడుతూ గిరిజన మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల బలోపేతానికి ఐటిడిఏ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. గిరిజన యువత ఆధునిక సాంకేతికతను వినియోగించి మార్కెటింగ్ రంగంలో కూడా రాణించాలని సూచించారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా విక్రయాలు చేపడితే అధిక లాభాలు పొందవచ్చన్నారు. గిరిజన ప్రాంతాల నిరుద్యోగ యువతకు మత్స్య రంగంలో స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక నిధులు కేటాయిస్తామని వివరించారు. ఆధునిక వలలు, మోటార్ బోట్లు, ఇతర పరికరాల కొనుగోలుకు రాయితీ రుణాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారి లాయక్ మొహమ్మద్దీన్, ఆర్డీఓ కూనలా గంగాధర్, మత్స్య శాఖ అధికారులు, గిరిజన మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల అధ్యక్షులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో మాదిగలకు అన్యాయం

**నేరడిగొండ:** తెలంగాణ పీసీసీ ఇటీవల ప్రకటించిన మండల, పట్టణ అధ్యక్ష పదవుల జాబితాలో ఆదిలాబాద్ జిల్లాలో మాదిగ సామాజిక వర్గానికి ఒక్క పదవి కూడా కేటాయించకపోవడంపై మాదిగ జాగృతి సంఘం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు నేరడిగొండ, బోథ్ మండలాల్లో నిర్వహించిన సమావేశాల్లో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ మాట్లాడారు. రాహుల్ గాంధీ దేశ వ్యాప్తంగా కుల గణన, సామాజిక న్యాయం గురించి మాట్లాడుతున్నప్పటికీ, తెలంగాణలో మాత్రం ఆ ఆలోచనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. పార్టీ కోసం దశాబ్దాలుగా అంకితభావంతో పనిచేస్తున్న మాదిగలను కాంగ్రెస్ పార్టీ నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ఇటీవల నిర్వహించిన జనగణనలో మాదిగల జనాభా అధికంగా ఉన్నట్లు పార్టీ ప్రకటించినప్పటికీ, మండల అధ్యక్షులు, నామినేటెడ్ పదవుల కేటాయింపులో సరైన ప్రాతినిధ్యం కల్పించకపోవడం అన్యాయమని అన్నారు. పార్టీకి మాదిగలపై నిజమైన గౌరవం ఉంటే వెంటనే స్పందించి పార్టీ పదవులు, నామినేటెడ్ పోస్టుల్లో 50 శాతం వాటా మాదిగలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో మాదిగల తరపున ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



# రైతులకు రూ.5కే మధ్యాహ్న భోజనం

- **కార్యక్రమాన్ని ప్రారంభించిన మార్కెట్ కమిటీ చైర్మన్**

**ఆదిలాబాద్:** రైతుల సంక్షేమమే లక్ష్యంగా ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో రైతులకు రూ.5కే మధ్యాహ్న భోజనం అందించే కార్యక్రమాన్ని మార్కెట్ యార్డులో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి మంగళవారం పాలకవర్గ సభ్యులతో కలిసి ప్రారంభించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ సౌజన్యంతో, ఇస్కాన్ సొసైటీ సహకారంతో చేపట్టిన ఈ కార్యక్రమం



ద్వారా మార్కెట్ యార్డుకు వచ్చే మొక్కజొన్న, జొన్న రైతులకు తక్కువ ధరకే భోజనం అందించనున్నట్లు తెలిపారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా మార్కెట్ యార్డులో అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కమిటీ కృషి చేస్తోందన్నారు. రైతుల కోసం అహర్నిశలు శ్రమిస్తున్నామని, మార్కెట్ యార్డుకు వచ్చే ప్రతి రైతుకు మౌలిక వసతులు, తాగునీరు, విశ్రాంతి సౌకర్యాలతో పాటు భోజన వసతి కూడా అందుబాటులో ఉంచుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి వై.గజానంద్, మార్కెట్ సిబ్బంది, ఇస్కాన్ సొసైటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# కారులో చెలరేగిన మంటలు.. తృటిలో తప్పిన ప్రమాదం






**నేరడిగొండ:** ఇచ్చోడ మండలంలోని రాణి జిన్నింగ్ మిల్లు సమీపంలో జాతీయ రహదారి 44పై మంగళవారం సాయంత్రం కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగి వాహనం పూర్తిగా దగ్ధమైంది. కారులో ఉన్న కుటుంబ సభ్యులు సమయానికి బయటకు దిగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇచ్చోడ మండలంలోని సిరిచెల్మ గ్రామానికి చెందిన ఫారూఖ్ తన కుటుంబ సభ్యులతో కలిసి కారులో ఇచ్చోడ నుంచి నిర్మల్ వైపు వెళుతుండగా మార్గమధ్యలో కారు ఇంజిన్ నుంచి ఒక్కసారిగా మంటలు రావడం ప్రారంభమైంది. ప్రమాదాన్ని గుర్తించిన డ్రైవర్ వెంటనే అప్రమత్తమై కారును రోడ్డు పక్కన నిలిపివేశారు. కారులో ఉన్న వారంతా వెంటనే బయటకు దిగిపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అనంతరం మంటలు వేగంగా వ్యాపించి కారు పూర్తిగా కాలిపోయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఘటనపై సమాచారం అందుకున్న ఇచ్చోడ సీఐ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు. అగ్నిప్రమాదం కారణంగా కొంతసేపు జాతీయ రహదారిపై ట్రాఫిక్కు అంతరాయం ఏర్పడగా, పోలీసులు ట్రాఫిక్ను క్లియర్ చేసి పునరుద్ధరించారు.

# బోథ్ ఏఎంసీ చైర్మన్గా మల్లెపూల సత్యనారాయణ

**బోథ్ (నేరడిగొండ):** బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్గా మల్లెపూల సత్యనారాయణ రెండోసారి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన నియామకం ఖరారైంది. అలాగే మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడిగా నేరడిగొండ మండలం బుద్ధికొండ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మోహన్ రెడ్డిని ప్రభుత్వం ఎంపిక చేసింది. చైర్మన్ పదవి కోసం కాంగ్రెస్ పార్టీలో పలువురు నాయకులు తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్సాగర్ రావుకు అత్యంత సన్నిహితుడిగా, నమ్మకస్థుడిగా పేరున్న మల్లెపూల సత్యనారాయణకే అధిష్టానం మరోసారి అవకాశం కల్పించింది. ఈ నియామకంలో ఎమ్మెల్యే ప్రేమ్సాగర్



రావుతో పాటు డీసీసీ అధ్యక్షులు, పలువురు సీనియర్ నాయకుల మద్దతు కీలకంగా నిలిచినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ పదవుల కోసం స్థానిక కాంగ్రెస్ పార్టీలో వివిధ వర్గాల నుంచి గట్టి పోటీ నెలకొనగా, అనేక మంది ఆశావహులు ప్రయత్నాలు చేశారు. ఎట్టకేలకు సత్యనారాయణ, మోహన్ రెడ్డిల నియామకం ఖరారు కావడంతో ఆశావహుల ప్రయత్నాలకు తెరపడింది. తమపై నమ్మకం ఉంచి మరోసారి బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేస్తామని నూతన చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి పేర్కొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రులకు విలువైన వైద్య పరికరాలు



**కాగజ్నగర్:** భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) సంస్థ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల ద్వారా జిల్లా పరిధిలోని వివిధ ప్రభుత్వ ఆసుపత్రులకు రూ.80లక్షల విలువైన ఆధునిక వైద్య పరికరాలను అందజేసింది. ఈ సందర్భంగా సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య సేవలను మరింత మెరుగుపర్చే లక్ష్యంతో ఆసుపత్రులకు డిజిటల్ ఎక్రేస్ యంత్రాలు, ఐసీయూ పడకలు, బ్లడ్ సెల్ కౌంటర్లు, శిశువుల వార్మర్లు, స్ట్రెచర్లు తదితర వైద్య పరికరాలను అందించినట్లు తెలిపారు. ఈ పరికరాల ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు మరింత చేరువ అవుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సదుపాయాల పెంపుతో ప్రజలకు మెరుగైన చికిత్స అందించేందుకు ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

# చేయూత పెన్షన్లలో పారదర్శకతకు ప్రభుత్వం చర్యలు



**కాగజ్నగర్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న చేయూత పెన్షన్లలో పారదర్శకతను పెంచేందుకు ప్రవేశపెట్టిన "లైవ్నెస్ ఆథెంటికేషన్"కార్యక్రమం కాగజ్నగర్ మున్సిపాలిటీ 25వ వార్డులో విజయవంతంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ దుర్గం సూరజ్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేరేలా చర్యలు తీసుకుంటోందన్నారు. పెన్షనర్ల వివరాలను ఆధునిక సాంకేతికత ద్వారా ధృవీకరించడంతో పారదర్శకత మరింత పెరుగుతుందని తెలిపారు. వార్డు ఆఫీసర్ గోవర్ధన్ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పెన్షనర్ల లైవ్నెస్ ఆథెంటికేషన్ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజలు సహకరించాలని అధికారులు కోరారు. పెన్షనర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటూ ప్రక్రియను సజావుగా నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ సిబ్బంది తెలిపారు.

# జిల్లా పర్యటనకు రానున్న మంత్రులు



**కాగజ్నగర్:** కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాకు పలువురు మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు బుధవారం పర్యటించనున్నారు. రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, గడ్డం వివేక్తో పాటు ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు జిల్లా పర్యటనలో పాల్గొననున్నారు. జూన్ 2న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా పర్యటన నేపథ్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై నాయకులు సమీక్ష నిర్వహించనున్నారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సభా ఏర్పాట్లు, భద్రతా చర్యలు తదితర అంశాలపై అధికారులతో సమావేశమై దిశానిర్దేశం చేయనున్నారు. ఈ పర్యటన సందర్భంగా సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొననున్నట్లు సమాచారం.

